
# పున్నమిలాగ వచ్చిపొమ్మని...

- కుప్పిలి పద్మ



**మళ్ళీ వచ్చాను. యీ మమతల తోటకి రాలేకపోతే వుండలేని వసంత కోయిల్లా. కొండల కవతల లోయల్లోంచి తోటలమీదుగా వినిపిస్తున్న పూర్వ బాల్య యవ్వన దినోత్సవాల సుసంభరాన్ని చెప్పాల్సిన సమయమిదే.**

**చూట్టూ చూశాను. అదే ప్రాంగణం. కొత్త రంగులతో. అవే యెత్తైన అరుగులు. వొకప్పుడున్నంత మట్టి లేదిప్పుడు. యెక్కువ మేర బండలు పరిచారు. అప్పటి నేరేడు చెట్టూ, వేప చెట్టు లేవ్. అప్పట్లో యీ యింట్లో వున్నంత మంది మనుష్యులు వుండటం లేదు.**

అసలీ యిల్లు యెలా వుండేది!

యేవైపు నుంచి చూసినా కనిపించే యెత్తైన యిల్లు. చుట్టూ పరిపూర్ణమైన తోట. ఎప్పుడూ పువ్వులు, కాయగూరలు, ఫలాలతో సమ్మిళితమైన సువాసనలు వీస్తుండేవి. యింట్లో వాకిట్లో పెరట్లో యెటు చూసినా మనుష్యులే. వీరందరిని పెనవేసిన అనురాగపు నిధి అమ్మమ్మ కాదంబరి.

''పెళ్ళయ్యాక కాపురమైతే పారుగూరులో పెట్టారండి అమ్మగారు. కాని శర్వాణమ్మ గారెప్పుడూ అమ్మగారింటే వుంటారండి'' అమ్మ గురించి భీముడెప్పుడు యిలానే చెపుతుండేవాడు.

నిజమే కదా... వూహ తెలిసినప్పటి నుంచి యీ యిల్లు, ఆ కొండలు, ఆ కొండలపై రాత్రిపూట కనిపించే సత్యదేవుని ఆలయ దీపాలు. యీ యింట్లోని తాతగారు, పెద్దమ్మలు, పిన్నమ్మలు, బాబాయ్‌లు, మావయ్యలు, బావలు, వదినలు, అక్కలు తన వయస్సు పిల్లలు. యిదే యింట్లో యెన్నెన్ని సంక్రాంతులు జరుపుకున్నాం.

అసలు సంక్రాంతి వచ్చిందంటే కొత్త బట్టల కోలాహలం. అప్పట్లో సంక్రాంతికి, పుట్టినరోజులకి, యెవరివైనా పెళ్ళిళ్ళుంటే కొత్త బట్టలు కొనేవారు. యిప్పట్లా యెప్పుడు పడితే అప్పుడు బట్టలు కొనటం వుండేది కాదు. కొత్త బియ్యం దంచి, ఆ పిండితో కొత్త బెల్లంతో కలిపి చేసిన అరిశెల ఘుమ ఘుమలు బంతి చామంతులు, మగ్గిన రేగిపళ్ళ సువాసనలతో యిల్లంతా తీపి గాలులు.

చిట్టత్త చిట్టి చామంతులతో జడలల్లాలని పిల్లలందరి వెంట తిరుగుతుండేది. వేసవిలో చిట్టత్తతో జడ కుట్టించుకోటానికి పోటీపడే వాళ్ళం కానీ 'యీ చామంతుల బరువునెట్లా మొయ్యాలత్తా' అని వాపోయేవాళ్ళం. అయినా అప్పటికి నాలుగైదు జడలు ఆమె ముచ్చటని తీర్చేవి.

సాయంకాలమయ్యేసరికి అంతా రాధత్త చుట్టూ చేరేవాళ్ళం. యే పాటైనా అడగటం ఆలస్యం చెంగుచెంగునా అందుకునేది. చినబావతో టూరింగ్ టాకీస్‌లో సినిమాల కెళ్ళే పథకాలొకవైపు, చిన్న పిల్లలకి రేగుపళ్ళు పోసినప్పుడు యేరుకుంటే దొరికే చిల్లర డబ్బులతో డబ్బా ఐస్ ఫ్రూటో, పీచు మిఠాయో తేల్చుకోలేని తర్జనభర్జనలు. యిప్పుడేమో మాల్స్‌లో ప్లాస్టిక్ డబ్బాల్లో పీచుమిఠాయిని అందంగా ప్యాక్ చేసి అమ్మటం చూసి పీచు మిఠాయికేం మహద్భాగ్యం అనుకున్నా. కానీ యెప్పుడూ ఆ డబ్బాలోని పీచు మిఠాయిని రుచి చూడాలనిపించలేదు. ముగ్గులు వేయటం, యెక్కడ నుంచి వూరేవోగాని అందరూ అందరితో తెగ మాట్లాడేసుకోవటం. సులోచనా రాణిగారి మీన, రాజశేఖర్‌ల గురించి చదివినవాళ్ళు చదివినవాళ్ళకే చెప్పేస్తుండేవారు.

మా అందరి మధ్యా వుండే ఆత్మీయతకి, స్నేహానికి, అనుబంధానికి అయువుపట్టు మా అమ్మమ్మ తాతగారు.

డిగ్రీ పరీక్షలు రాసిన శెలవుల్లో పెళ్ళి సంబంధ మొచ్చింది. అతనో సాఫ్ట్‌వేర్ యింజనీర్. వాళ్ళది గోదావరికి అటుపక్క పల్లె. అయినా వివేక్ వుద్యోగం కోసం వుండేదేమో పొరుగు రాష్ట్రం. చాముండేశ్వరిని చూడొచ్చన్నా, వూటీ పొగమంచును కప్పుకోవచ్చన్నా ''అమ్మకి అమ్మమ్మకి దూరంగా వెళ్ళను. వెళ్ళి వుండలేను. వున్న వూరిలో

యే చిన్న వుద్యోగమో, వ్యవసాయమో చేసుకునేవాళ్ళనైనా చేసుకుంటా కానీ, వివేక్ వద్దంటే వద్దు'' అన్నాను.

''అలా అంటే ఎలాగమ్మా మన బంధువుల్లో యింజనీర్స్ వున్నారు కానీ సాఫ్ట్‌వేర్ యింజనీర్స్ లేరు. ఫస్ట్ జనరేషన్ సాఫ్ట్‌వేర్ యింజనీర్‌కి భార్యవి అవ్వటం యెంత అదృష్టం'' అన్నాడు మావయ్య.

మావయ్యకి యేం చెప్పినా అర్థం కాదు. అమ్మతోనో, అమ్మమ్మతోనో మాట్లాడాలి.

ఆ రోజు కొండలకవతల పేదరాశి పెద్దమ్మ కుంకుమ ఆరపోస్తున్న వేళ ''అమ్మని, నిన్నూ వదిలి దూరంగా ఉండలేను. యెప్పటికీ మీకు దగ్గర్లోనే, వీలైతే అమ్మ యింటి పక్కనున్న యింట్లోనే వుండాలని వుంది. మీరు నన్ను వదిలి వుండలేరు కదా'' అమ్మమ్మతో చెప్పాను.

అమ్మమ్మ చిన్నగా నవ్వి ''నీ బెంగ నాకర్థమవుతోందిరా.. నువ్వు దూరంగా వుంటే మాకు బెంగే. కాని మన జీవితాల్లో మనకి దొరికే తోడు అన్నింటికన్నా ముఖ్యం. మనమంటే యిష్టం, గౌరవం, మన మనసు నొప్పించకూడదనే సంస్కారం, అర్థం చేసుకునే తత్త్వం వుండే మనిషి మనకి దొరకకపోతే మన శ్శాంతి వుండదమ్మడూ. యిలాంటి లక్షణాలు వివేక్‌లో చూశాను. యెలాగనంటావేమో. వాళ్ళ కుటుంబం మనకి అసలు తెలియనిది కాదు. మనలానే కలసిమెలసి వున్న పెద్ద కుటుంబం. మంచికి చెడ్డకి దన్నుగా నిలబడతారు. అమ్మానాన్న అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములతో మనుష్యులు కలిసుండాలి. అలానే చుట్టుపక్కల వాళ్ళతో బంధువులతో స్నేహితులతో కలివిడిగా వుండాలి. యిలానే వివేక్ ఉన్నాడు. మనుష్యులకి దూరంగా వుండే వ్యక్తులతో జీవితం ప్రమాదకరం. యింక దూరం అంటావా.... చూద్దాం, వివేక్ యిక్కడ దగ్గర్లో బిజినెస్ మొదలుపెట్టొచ్చు. వ్యవసాయం చేయొచ్చు. లేదా అక్కడే వుండొచ్చు. యెక్కడున్నా నీ జీవితం సంతోషంగా వుంటుంది.'' అని ఆగి చుట్టూ యేపుగా పెరిగిన తోటని చూస్తూ యిది మా అమ్మగారి యిల్లు. అమ్మకి మగపిల్లలు లేరు. తన యీ యింటిని పొలాన్ని చూసుకోటానికి వొక్క మగ పిల్లాడుంటే బాగుండేది కదా అనుకునేది. ఆడపిల్లలు ముగ్గురు పెళ్ళిళ్ళు చేసుకుని వెళ్ళిపోయేవాళ్ళే కదా అనుకునేది. మీ తాతగారితో నా పెళ్ళయింది. అమ్మకి వున్న చింత చెప్పానొకసారి. ఆయన ఆలోచించి వాళ్ళ యింట్లో వాళ్ళతో మాట్లాడి యీ యింట్లోనే మనముందామన్నారు. మా అమ్మ ఆనందానికి అంతేలేదు. అతనికే ఆస్తి లేక కాదు. అమ్మకి కొడుకునౌదామనుకున్నారు. అంతే. తాతగారి మంచి మనసు సంస్కారం వల్లే కదా యీ యిల్లు యిలా కళకళలాడుతోంది. లేకపోతే నేనేం చేయగలను. వొక్క రాత్రి ప్రయాణం చేసే దూరమే కదరా. వివేక్‌కి నువ్వు చాలా నచ్చావ్. యెలాగైనా యీ సంబంధం కుదిరేట్టు చూడమన్నారంట. నిన్ను యిష్టపడే మనిషి దొరకటం అదృష్టమే కదరా'' యిలా అమ్మమ్మ పెళ్ళికి వొప్పించింది.

'వివేక్‌కి నువ్వంటే యిష్టం'.... వో అపరిచిత యువకుడు యిష్టపడటం అంటే యెలా వుంటుంది. అతని రూపం అస్పష్టం. కుతూహలం మొదలయింది. పెళ్ళయిపోయింది.

'వివేక్ ప్రేమగా చూసుకునేవాడు. మా అత్తగారు మరో మా అమ్మమ్మలా ఆత్మీయంగా వుండేది. వివేక్ తరచుగా అమ్మ, అమ్మమ్మ దగ్గరకు పంపించేవాడు. యిక్కడికి వచ్చినప్పుడు తిరిగి వివేక్‌ని చూడాలనిపించేది. అక్కడుంటే వీళ్ళపై బెంగ. యిదిగో యిలా వద్దనే దగ్గరగా వుండాలనుకున్నా. యిలానే పుట్టినప్పట్నుంచి వున్న ఆత్మీయులకు యీ కొత్త ఆత్మీయునికి మధ్య హృదయం బెంగతో వూయలలూగేది.

తల్లిని కాబోతున్నానని తెలియగానే అనిర్వచనీయమైన వుద్వేగం. అమ్మమ్మని అమ్మని చూడాలనే వుద్వేగం. వెంటనే ఊరు ప్రయాణం.

ఆ పల్లె. ఆ పూర్వీకుల యిల్లు. యీ నూతన జీవాన్ని ఆశీర్వదించాయి.

నెలలు నిండాయి.

పాప పుట్టింది.

మాధురీలత.

మధూకి మూడో నెలొచ్చాక వివేక్ దగ్గరకి పంపిస్తామన్నారు. వివేక్ మమ్మల్ని వదల్లేకవదల్లేక వెళ్ళాడు.

అమ్మమ్మ వుదయం సాయంకాలం తోటలో కొండలకి యిటువైపునున్న ప్రాంగణంలో చెట్ల చుట్టూ కట్టిన చప్టా మీద మాధురీని వళ్ళో కూర్చోబెట్టుకుని కూర్చుని ఆ కొండలవైపు ఆకాశం వైపు పారే నదీపాయ వైపు తోటలవైపు చూస్తుండేది. ఆ చూపులు చాలా లోతైనవి.

ఆమె యేం ఆలోచిస్తుంటుంది.

అడిగానోరోజు.

''మా అమ్మని, అమ్మమ్మని, అమ్మమ్మ వాళ్ళ అమ్మని, మీ అమ్మని, నిన్ను, నీ కూతుర్ని చూసాను. యెన్ని తరాలో చూడు. అన్నవరం, సింహాచలం, తిరుపతి, రాజమండ్రి, విశాఖ యిలా యీ చుట్టుపక్కల యిళ్ళు వూర్లు మనుష్యులు యింతే నే చూసిన ప్రపంచం. వీటితోనే నా జీవితం పెనవేసుకుపోయింది. పిల్లల్ని మృదువుగా పెంచటంలో నా కెంతో ఆనందం దొరికేది. యిప్పుడిప్పుడే యీ యింట్లోని పిల్లలు పెళ్ళిళ్ళు, చదువులు, వుద్యోగాలని విశాఖకో, హైదరాబాదుకో వొకొక్కరూ వెళుతున్నారు. ప్రవాహం జీవ లక్షణమని తెలుసు. యీ మధ్య నాకేమనిపిస్తోందంటే యీ యింట కోలాహలాన్ని ఎవరు సజావుగా వుంచుతారు. యీ యింట దీపాన్ని యెప్పుడు యెవరు వెలిగిస్తుంటారు'' అంటూ నిశ్చలంగా నా వైపు మాధురీవైపు చూస్తూ ''యీ యింట్లోని పిల్లలందరి కంటే నీకే యింటిపట్ల మనుష్యులపట్ల ఆపేక్ష ఎక్కువ. యిల్లుదేముంది మనుష్యులు ముఖ్యం. యీ యింటి బాధ్యత నువ్వు తీసుకుంటావా. వివేక్ రిటైర్ అయ్యాక యిక్కడికి వస్తావా తల్లీ, అప్పటి వరకు నేను, తర్వాత మీ అమ్మ యీ యింటి వెలుగుని యిలానే వుంచుతాం'' అడిగారామె. తరతరాల జీవం నిక్షిప్తమైన ఆమె నేత్రద్వయాన్ని చూస్తూ 'నా జీవన సాఫల్యాన్ని అన్వేషించే మార్గమిదేనేమో' అనుకుంటూ ఉదయిస్తున్న చంద్రుని సాక్షిగా ఆమెకి మాటిచ్చాను. అమ్మమ్మ నవ్వింది అద్భుతంగా.

బాంధవ్యపు కంటిన్యూటీ దొరికిన సంతృప్తి చూసానామె కళ్ళల్లో.

ఆ యేడాది సంక్రాంతికి మాధురీలతకి బోగి పళ్ళు పోస్తున్నాం. పళ్ళు, చెరుకు ముక్కలు, పైసలు యేరుకునే సందడి. వివేక్‌కి ఫోన్ వచ్చింది. మాట్లాడొచ్చాడు. అతని ముఖంలో కోటి సూర్యుల వెలుగు.


'అమెరికాలో వుద్యోగం వచ్చింది' చెప్పాడందరి ముందు.

'అమెరికా....... ఆశ్చర్యంగా అద్భుతంగా అన్నారు కొందరు.

అమ్మమ్మ వైపు చూసాను.

చూపులు కలిశాయి.

ఆ రాత్రి వివేక్‌ని ''నువ్వు అమెరికా వెళితే నేనూ పాప'' అడిగాను.



"ముందు నే వెళ్ళి అన్ని అమరుస్తాను. తర్వాత నువ్వు పాపని తీసుకుని వచ్చేయ్" అన్నాడు.

"అంత దూరం యింతమందిని వదిలేసి, ఆ జాబ్ అంత ముఖ్యమా..... యిక్కడ మనకేం తక్కువ" అడిగాను.

"మంచి అవకాశం. నాకున్న నాలెడ్జికి, అప్లికేషన్స్‌కి గొప్ప అవకాశం. యీ ఫీల్డ్‌లో నేనెంతో గొప్పగా నిలబడాలి" అన్నాడతను.

"యింతమందిని వదిలేసి రాలేను. అలాని నీకు దూరంగా వుండలేను. ప్లీజ్ వివేక్ ఆ ఆలోచన వదిలైలేవా" అడిగాను.

"అదెలా.... రాకుండా ఎలా... నేనెలా వుంటాను. రెండేళ్ళు అంతే. తిరిగి వచ్చేద్దాం. ప్లీజ్" అడిగాడు వివేక్.

నాకిష్టం లేకుండా నా ప్రమేయం లేకుండా నిస్సహాయంగా నా జీవిత యాత్ర మొదలైంది.

అక్కడే బాబు పుట్టాడు.

హాస్పటల్‌లో వివేక్ నాతోనే ఉన్నాడు.

రెండేళ్ళు కాస్తా యిరవై రెండేళ్ళు అయ్యాయి.

పిల్లలిద్దరి చదువులు అమెరికాలోనే. ఈ యిరవైరెండేళ్ళ కాలంలో అమ్మమ్మ పోయారు. ప్రాణమంత ప్రేమైన అమ్మమ్మని చివరి చూపు చూడలేకపోయాను.

ప్రభుత్వాలు మారాయి. గ్లోబల్ యెకానమీ తలుపులు తెరిచిన కాలం. యు.ఎస్.కి యిండియా నుంచి మనుష్యుల ప్రవాహం. చుట్టాలు, స్నేహితులూ వున్నారందులో.

సెల్‌ఫోన్, యీ-మెయిల్ త్వరత్వరగా చేరుకునే భావాలు, మాటలు. వెబ్ కెమేరా వచ్చాక మరింతగా పెరిగిన చూపులు. స్టార్ టి.వి. డ్రాయింగ్ రూమ్స్‌లోకి వచ్చాక ప్రపంచవ్యాప్త జీవితం చేరువే. యిన్ని యిలా విప్లవాత్మకంగా దేశదేశాలని కలిపేస్తున్నా , నా మనసెప్పుడూ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై సామానుతో నిలబడినట్టుంటుంది. ఎక్కవల్సిన రైలు వస్తుంది నా వూరికి వెళ్ళిపోవాలనే ఆత్రంలానే వుంది.

వివేక్ తన ఫీల్డ్‌లో విజయాల మీద విజయాలు సాధించాడు. దేశదేశాలకీ పనిమీద తిరుగుతుండేవాడు. నేను పిల్లల్ని పెంచుతూ యింట్లోనే వుండే దాన్ని. పిల్లల్ని చూస్తుంటే బోల్డంత ముచ్చటగా వుండేది. ఆరోజు యిండియా నుంచి ఫోన్. నాన్నగారికి ఆరోగ్యం బాగాలేదని.

వెబ్ కెమెరాలో హాస్పటల్లో వున్న నాన్నగారిని చూపిస్తున్నారు.

స్పర్శలేని యీ టెక్నాలజీ నా మనసుకే వూరట నివ్వటం లేదు.

ఆ రోజు చాలా యేళ్ళ తర్వాత వివేక్‌తో మాట్లాడాను మనసువిప్పి.

"నేనెప్పుడు యిలా బతకాలనుకోలేదు. నీ కోసం నీ గోల్ కోసం యిక్కడికి వచ్చాను. నీ ప్రేమ, పిల్లలంటే వుండే ప్రేమతో వున్నాను. యీ ఇల్లు, యీ గాలి అన్నీ అపరిచితంగానే వున్నాయి. మీ నాన్నగారికి బాగోలేనప్పుడు పక్కనుండగలిగావా. నీ విజయోత్సవాలప్పుడు మనవాళ్ళు ఎవరైనా నీ పక్కనున్నారా. రెండేళ్ళు అన్నావ్. యెన్నేళ్ళు అయింది వివేక్" అన్నాను.

"అరే.... నువ్వు అలవాటు పడిపోతావనుకున్నాను. యిక్కడికి వచ్చిన వాళ్ళెవ్వరూ నీలా ఇంకా మా వూరు , యిల్లు అంటూ బెంగ పెట్టుకోవటం చూళ్ళేదు. అంతా హ్యాపీగా, ప్రౌడ్‌గా ఫీలవుతుంటారు. యిక్కడికి రావాలని, తమ ఫ్యూచర్ బ్రైట్‌గా ఉండాలని ప్రతిరోజు అమెరికన్ వీసా కోసం యిండియాలో క్యూలు కడుతున్నారు. యిప్పుడిలా యెకానమీ కింద పడినా నా జాబ్‌కి త్రెట్ లేదు. మన చుట్టాలోకెల్లా మనమెంతో రిచ్‌గా ఎదిగాం. సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో యీ రోజు ఐ యామ్ సమ్‌థింగ్ అంటే యెలా వీలయింది. యిక్కడికి రావటం వల్లేకదా. మన పిల్లలకి యెంత మంచి యెడ్యుకేషన్ వచ్చింది. యిదంతా నీకు తృప్తిగా లేదా" అడిగాడు.

'నీ విజయాలు, పిల్లల చదువులు నిజమే అసలు యీ మొత్తంలో నేనేంటి. మొదట్లో సంవత్సరానికి ఒకసారి యిండియాకి వెళ్ళటం రాను రాను నీ పని బిజీ లేదా పిల్లల చదువు, మూడేళ్ళు నాలుగేళ్ళు గ్యాప్ వచ్చేది. అసలు నేనేమాత్రం కోరుకోని, యిష్టపడని యీ జీవితంలోకి నేనెలా వచ్చిపడ్డాను. యిక్కడ వుండటానికి యిష్టపడే వాళ్ళు వుండొచ్చు. అది వాళ్ళిష్టం. అలా యిష్టం లేనివాళ్ళూ వుండొచ్చు కదా. బ్రెయిన్ డ్రెయిన్‌పై వ్యాసాలు చదివి, వ్యాస రచన వక్తృత్వపు పోటీల్లో పాల్గొన్న జనరేషన్ నుంచి వచ్చిన మనిషిని. గ్లోబల్ సినేరియోలో పెరిగిన పిల్లలు యూ.ఎస్‌లో అవకాశాల కోసం వెతుక్కునేట్టు వాళ్ళ మానసికస్థితి ఉంటుంది. ఈ తేడా అర్థం కాదా. అసలు అర్థం చేసుకోకూడదనుకుంటున్నావా" అడిగాను. ముభావంగా వుండిపోయాడు.

వివేక్ యింతకాలం వో హోరులో కొట్టుకుపోయాడు. అతనికి సడెన్‌గా యిండియాలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని ఫ్లోట్ చేస్తే బాగుండుననే ఆలోచన వచ్చింది.

'మనం యిండియా వెళదాం' అన్నాడు.

అయోమయంగా చూశాను.

"పిల్లలకి అక్కడ పెళ్ళి చేద్దాం. నలభై ఐదేళ్ళ వివేక్ యిండియాలో కంపెనీ పెడితే చాలా సక్సెస్ చేయగలడు" నవ్వుతూ అన్నాడు.

"నిజంగా వెళదామా"... అక్కడికి వెళ్ళగానే ఆ యింటిపని పొలం పని చేయించటం, తోటల్ని చూసుకోవటం, వచ్చేపోయే మనుష్యులు వో నిండైన ప్రవాహం మనసంతా.

పిల్లలతో తనే చెపుతానన్నాడు వివేక్.

కానీ యేం చెప్పకుండా వెకేషన్‌లో మా అందర్నీ యిండియాకి తీసుకొచ్చాడు.

మేం యింటికి వచ్చిన మర్నాడు సైబరాబాద్ వెళ్ళాడు.

అక్కడికి వెళ్ళిన రాత్రి ఫోన్ చేసి "వో మై గాడ్...."

వూహించలేనంత కరప్షన్. వినటం వేరు. అక్కడుండగా చూసింది వేరు. యిక్కడ ఏదైనా పెట్టాలంటే ముందు లంచాలివ్వటం, తీసుకోవటం నేర్చుకోవాలి. సఫకేటింగ్" అన్నాడు.

## కత్రినాకి అది ఇష్టం ఉండదట!

సినిమాకి సంబంధించి కత్రినా ఏది చేయమన్నా చేస్తుందట కానీ, జీరో సైజుకి మాత్రం మారదట! పాత్ర పరంగా అయినా సరే సన్నబడదట! ఇప్పుడు జీరో సైజుకి మారి, ఆ తరువాత తిరిగి లావెక్కడం వంటివి తనకు అస్సలు ఇష్టం ఉండదనీ, జీరో సైజు అంటే తనకు ఎలర్జీ అని కూడా చెబుతోంది. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే...

ఇటీవల ఓ సినిమా కోసం కత్రినాను జీరో సైజుకి మారమని దర్శక, నిర్మాతలు అడిగారట! అప్పుడు దానికి కత్రినా, "ఇంక దేనికన్నా ఓకే కానీ, జీరో సైజుకి మాత్రం మారననీ, అవసరం అయితే సినిమాను అన్నా వదులుకుంటాను" అని కరాఖండిగా చెప్పడంతో ఆ దర్శక నిర్మాతలు తెల్లమొహం వేశారట!



"అంటే మనమిక్కడ....'' ఆగిపోయాను మధ్యలో.

"డౌట్'' అన్నాడు.

వొళ్లు మండింది. యిండియా నుంచి అక్కడికి వెళ్ళి కొన్నాళ్లుండి యిక్కడికి వచ్చిన వాళ్ళంతా అదే మొదటిసారి వింటున్నంత ఆశ్చర్యంగా యిక్కడి విషయాలు గురించి మాట్లాడతారు. కమ్యునికేషన్ యింతగా పెరిగిన కాలం పెద్ద పెద్ద వుద్యోగాల్లో వున్న వీళ్ళకి నిజంగానే యేం తెలియ కుండా వుంటాయా యిక్కడ పరిస్థితులు.

ఆ చికాకు ఆ సందిగ్ధం మనసులో తిరుగుతుం డగానే అమ్మ మాధురి పెళ్ళి విషయం కదిపింది.

రాజమండ్రిలో మంచి సంబంధం వుందని, అబ్బాయి సాఫ్ట్‌వేర్ యింజనీర్, క్యాంపస్ సెలక్షన్ వచ్చి యిన్ఫోసిస్‌లో జాబ్ వచ్చిందని చెప్పింది. మధుతో మాట్లాడాలనుకున్నాను.

చాలా సంవత్సరాల క్రితం అమ్మమ్మ మధుని వొడిలో పెట్టుకుని కూర్చున్న స్థలంలో నే కూర్చుని ఆలోచిస్తుండగా మధు వచ్చింది.

"మధు నీకు మ్యారేజ్ చేద్దాం అనుకుం టున్నాం. నీ దృష్టిలో యెవరైనా వుంటే చెప్పు. లేదా నీ ఛాయిస్ యేంటో చెప్పు'' అడిగాను.

"వో మై గాడ్! మామి అసలు నా కంత తీరిక ఎక్కడుంది. నీకు తెలుసుగా నేనిప్పటివరకు వన్ డే కూడా యెవ్వరితో డేట్ చేయలేదు. నా కసలు బోయ్ ఫ్రెండ్స్ లేకపోవటాన్ని అంతా వింతగా చూసేవారని నీకెన్నిసార్లు చెప్పలేదు . ... నీకు ఫ్రెండ్ యెందుకు లేడంటూ చాలా ప్రెషర్ వుండేది. యిప్పుడు పెళ్ళి కొడుకుని నువ్వే వెతుకు'' అంది మధు నవ్వుతూ.

"అది చాలా పెద్ద పని తల్లీ. కానీ నీ ఛాయిస్ ఏంటి'' అడిగాను. "ఎవరైనా పర్లేదు మామి. నీకు నచ్చాలి. నీ ఛాయిస్ బాగుంటుంది. కాకపోతే నేనొ క్కటే అనుకుంటున్నాను. మీరు యూ.ఎస్.లో సెటిల్ అయిన టైములో గానీ, అంతకుముందు గానీ సెటిల్ అయిన వాళ్ళ యిళ్ళలోని గై నే చూడండి. అక్కడే పుట్టి పెరిగిన అబ్బాయి అయితే కాంప్లికేషన్స్ చాలా తక్కువగా వుంటాయి'' అంది మధు.

"అదేంటి'' అయోమయంగా అడిగా.

"అవును... యిక్కడ పుట్టి పెరిగి యిప్పుడు వుద్యోగం కోసం అక్కడికి వచ్చే అబ్బాయి అయితే మేం యిద్దరం పెరిగిన వాతావరణం వేరు. ఇరవై ఐదేళ్ళుగా అతనికి ఇక్కడ వో జీవితం ఉంటుంది. వాటి నుంచి సెపరేట్ కావటానికి అతనెంత రెడీనో తెలియదు. నువ్వు నన్నెంత యిండియన్‌గా పెంచినా నా యాస్పిరేషన్స్ అమెరికావే. ఆ తేడా మా యిద్దరి మధ్య ఉండొచ్చు. మరొకటి నే చూసింది మన యింట్లో నిన్ను, నీ యెమోషనల్ క్రైసిస్‌ని. యిక్కడున్న నీ డియర్ అండ్ నియర్ కోసం నువ్వు పడిన ఆరాటం, అమ్మమ్మ, నాన్న మ్మల కోసం మనం యిండియా రావటం తిరిగి వెళుతున్నప్పుడు వాళ్ళు మనల్ని మిస్ చేస్తూ పడే బాధ, వాళ్ళని వదిలి వెళుతూ చిన్న పిల్లలాగా నేను తమ్ముడు పడిన బాధ.... యిదంతా పెద్ద క్రైసిస్ మామి. వున్న దేశంలో యే మారు మూల ఉన్నా యింత వెలితి వుండదు. బట్ బౌండరీస్ ఎప్పుడూ అడ్డమే. మాకు అమ్మమ్మ, నాన్నమ్మ, తాతగార్లు మామయ్యలు అన్నలు యిలా బంధువులందరితో వుండాలని వుండేది. యిండియాలో వున్నంత మంది మాకక్కడ లేరు. అందుకే మీరు అక్కడే వుంటారు. అక్కడ అబ్బాయి అయితే నాన్నమ్మ, తాతగారు, ఆ మిగిలిన ఫ్యామిలీ మెంబర్లు వుంటారు. పిల్లల్ని తీసుకుని ప్రతి యియర్‌కో, టూ యియర్స్‌కో మేం అటూ ఇటూ ట్రావెల్ చేయనక్క ర్లేదు. డెఫినెట్‌గా కొంత స్టేబుల్ యెమోషనల్ లైఫ్ వుంటుంది. అదీకాక ఆ అబ్బాయి యిక్కడి వాడ నుకో. ముందు అక్కడికి వచ్చినా తర్వాత పేరెం ట్స్‌ని యీ దేశాన్ని వదలలేని వాడనుకో. యిక్కడికి వచ్చేద్దామంటే. అప్పుడు నా జీవితం ఏంటి? నేని క్కడ వుండలేను. అందుకే యిలాంటి మెస్ లేకుండా అక్కడ సెటిల్ అయిన ఫ్యామిలీల్లోంచే అబ్బాయిని చూడు'' అంది మధు స్పష్టంగా.

నెత్తిమీద నుంచి బిందెడు చల్లనీళ్ళు గుమ్మరిం చినట్టు వళ్లంతా నీళ్ళధార. పొట్టలో తిప్పుతోంది.

జోఫర్.... జోఫర్.... మాత్ర మింగితే గానీ తిప్పుడు తగ్గేట్టు లేదు.

యెప్పటికైనా యిండియా వెళ్ళిపోతాం, అక్కడే సెటిల్ అవుతామని పిల్లలతో షేర్ చేసేదాన్ని. కాని వాళ్ళు సీరియస్‌గా తీసుకున్నట్టు లేదు.

యిప్పుడు మనమిక్కడేనని చెపితే..... వాళ్ళు ఇక్కడ ఇమడలేరు.

యిరవైయేళ్ళు బాల్యం యవ్వన జ్ఞాపకాలతో నా జీవనం యిక్కడ వెలిగింది. అలానే యిన్నేళ్ళు వాళ్ళ జీవనం అక్కడ వెలిగింది.

వివేక్‌కి యిక్కడ ఏదైనా చేయడంపట్ల ఆసక్తి తగ్గుతుందంటున్నాడు. అతనికి అక్కడే యిష్టం. పిల్లలకి అక్కడే ఉండాలని ఉంది. వీళ్ళందర్నీ అక్కడ వదిలేసి తను యిక్కడ సంతోషంగా వుండ గలదా?

యిరవై యేళ్ళ జీవనపు సారం మాత్రం యింకిన మనసు నాది. ఆ తర్వాత జీవితం సాగు తోంది. అంతే. ఆ రోజు వెళ్ళటం నా ఛాయిస్ కాదు. యీ రోజు తిరిగి అమెరికా వెళ్ళిపోవటం నా ఛాయిస్ కాదు. యెప్పటికైనా యిండియాకి వెళ్ళి పోతాననే ఆశ యింక లేదు.

నిస్సహాయంగా "సరే మధు'' అన్నాను.

'సారీ అమ్మమ్మ' మనసింకి పోయింది. యీ మమతల తోటకి నేనో వసంత కోయిలనే శాశ్వ తంగా.

★

రచయిత్రి సెల్ : 9866316174

## బొమ్మలు చెప్పిన కథ

నన్ను నేను ఛాయా చిత్రాల్లో చూస్తున్నాను
పరిణామ దశల్లో పయనిస్తున్నాను
ఛాయా చిత్రం...
ఒక నడక ఒక పరుగు
ఒక మజిలీ ఒక గమ్యం
బాల్యం మాసి పోయింది
కౌమారం కరిగి పోయింది
యౌవ్వనం తరలిపోయింది
వద్ధాప్యం పండిపోయింది!
నా కాళ్ళు చేతులు దోగాడ్డం చూసి
నాలో నేను నవ్వుకుంటాను
సిగ్గు దొంతరల భార్య ప్రక్కన
బాసికం కట్టిన వేషంలో నేను
పెదబాబు అందంలో అధిపుడే అయినా
చూపుల్లో నిరాశ కమ్ముకుంది
మాటేసిన ఆత్మహత్య కాటేసింది
అరచేతిలో భూగోళాన్ని నిలిపి
అమ్మాయి విజయ పతాకమై నిలిచింది
సాధించిన దానికి సంతృప్తో నిరాశో
అర్ధాంగి మోనాలిసా చిత్రమైంది
నాపై స్వారీ చేస్తున్న చినబాబు
జ్ఞాపకాల చిరుజల్లులు కురిపిస్తాడు
అమ్మను ఫోటో అడిగితే
నన్ను చూపి నువ్వేనేనంది
అమ్మ ప్రేమ ఆకాశమంత అన్నట్లు
దివికేగిన అమ్మ దీవిస్తూ వుంది
కండల్ని కరగించి పండించిన తండ్రి
కొండను వేస్తూ కనపడతాడు
నయాగరా నీటి తుంపర్లలో
అమెరికా స్మృతులు స్మరణకు వస్తాయి
తాజమహలు ప్రేమ మందిరం ముందు



సహచరి ఊసులు గూడు కడతాయి!
ఛాయా చిత్రం...
ఒక గుర్తు ఒక తలపు
ఒక చిరునామా ఒక చరిత్ర
బల్లకింద చాచిన అవినీతి హస్తానికి సాక్ష్యం
పొలాన్ని సంద్రంగా మార్చిన తుపానుకు సాక్ష్యం
నడి రోడ్డుపై వెంటాడి వేటాడిన హత్యకు సాక్ష్యం
ఆవాసాల్ని అంతశయ్యగా మార్చిన అగ్నికి సాక్ష్యం!
-అడిగోపుల వెంకటరత్నమ్